మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

రిజర్వాయర్‌కు భూసేకరణ

- రైతుల అభిప్రాయాలపై ప్రభుత్వానికి నివేదిక
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

వనపర్తి, జూన్17, ప్రభాతవార్త: బుద్ధారం పెద్ద చెరువు రిజర్వాయర్ భూ సేకరణకు సంబంధించి రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో బుద్ధారం పెద్ద చెరువు రిజర్వాయర్ భూ సేకరణ అంశంపై సంబంధిత గ్రామరైతులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి చర్చల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రిజర్వాయర్ పరిధిలోని 101 ఎకరాల భూముల రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు భూ సేకరణ అంశానికి సంబంధించి తమ అభిప్రాయాలను అధికారుల ముందు వెల్లడించారు. బుద్ధారం పెద్ద చెరువు రిజర్వాయర్ నిర్మాణంలో సేకరించనున్న 101 ఎకరాలకు సంబంధించి తమ గ్రామానికి చెందిన 200లకు పైగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. తామంతా కేవలం వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నామని, భూములు కోల్పోతే తమకు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు ఎకరానికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రూ.12.50 లక్షలు కాకుండా, పెద్ద మొత్తంలో నష్టపరిహారం ఇవ్వాలని విన్నవించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని,ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధిని చేకూర్చాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బుద్ధారం పెద్ద చెరువు రిజర్వాయర్ భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోనున్న రైతుల అభిప్రాయ సేకరణ కోసమే ఈ జిల్లాస్థాయి చర్చల కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో మార్కెట్ రేట్ల కు అనుగుణంగా ధరను నిర్ణయిస్తుందని, ఈ విషయంలో రైతులు ఆమోదయోగ్యం కానీ పరిహారాన్ని కోరడం సరైన విధానం కాదని సూచించారు. రైతులకు న్యాయం చేసేందుకే ప్రభుత్వం తరఫున తాము ఎప్పుడు ప్రయత్నిస్తామని తెలిపారు. కాబట్టి రైతులు వాస్తవ పరిస్థితులను ఆధారంగా చేసుకుని తమ విన్నపాన్ని తెలియజేయాలని సూచించారు. తద్వారా తాము రైతుల విన్నపాన్ని ప్రభుత్వానికి నివేదించి న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తామని తెలియజేశారు. అదేవిధంగా భూములు కోల్పోయే వారికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో ప్రాధాన్యత ఇస్తామని, కలెక్టర్‌హామీ ఇచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్,స్పెషల్ డిప్యూటీకలెక్టర్ తిరుపతయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర రెవెన్యూ అధికారులు, గ్రామ సర్పంచ్ శేఖర్ , గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- బాధితులకు సమగ్ర సేవలందించాలి
- మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి
- జిల్లా భరోసా కేంద్రం కన్వర్జెన్సీ సమావేశం

మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ క్రైమ్, జూన్ 17, ప్రభాతవార్త : మహబూబ్‌నగర్ జిల్లా భరోసా కేంద్రం ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులు, ఇతర బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ సూచించారు.ఈ మేరకు బుధవారం అధికారులతో సమన్వయ సమావేశం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో భరోసా కేంద్రంతో అనుసంధానమై పనిచేసే మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, న్యాయ సేవా సంస్థలు,చైల్డ్ లైన్, సామాజిక సంక్షేమ శాఖ, సఖి, ఎన్జీవో తదితర లైన్ డిపార్ట్‌మెంట్ల ప్రతినిధులుపాల్గొన్నారు. మొదటగా సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ద్వారా బాధితులకు అందిస్తున్న సేవలు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం జిల్లా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి బాధితుడికి అవసరమైన న్యాయ, వైద్య, మానసిక, సామాజిక మరియు పునరావాస సేవలు ఒకే వేదికపై అందేలా అన్నిశాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాధితుల సంక్షేమం విషయంలో ఆలస్యం లేకుండా స్పందించాలని, ప్రతి కేసును సున్నితంగా పరిశీలించి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మహిళలు, చిన్నారుల రక్షణకు సంబంధించిన కేసుల్లో శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఎంఅండ్‌హెచ్ఓ శ్రీనివాస్, డిసిఆర్బి డి.ఎస్.పి రమణా రెడ్డి, వర్టికల్ డిఎస్పి బాలాజీ, సిడబ్ల్యూసి ఛైర్మెన్ నయీముద్దీన్, పీపీ జాన్, పోలీస్ ఇన్స్పెక్టర్ లు, జెజెబి మెంబర్ గ్రేస్, ఐసిడిఎస్ నర్మదా, చైల్డ్ లైన్ అధికారి, ఎన్జీవో భరోసా కేంద్రం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కళాభారతిని ఎందుకు ప్రారంభించారు..?

- కెసిఆర్‌ను ఒప్పించి రూ.7 కోట్లు తెచ్చాం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్,జూన్ 17 ప్రభాతవార్త: కళ ప్రదర్శన ప్రారంభించేందుకు వస్తే టౌన్ హాల్ శిధిలావస్థలో ఉందని కళాకారులు చెబితే కెసిఆర్ ని ఒప్పించి ఐలమ్మ కళాభారతికి రూ.7 కోట్ల నిధులు తీసుకువచ్చామని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బుధవారం స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి కళాభారతిని సందర్శించారు. కళాకారులు ప్రదర్శనలు ఇచ్చేందుకు అవసరమైనవసతులు ఇందులో ఉన్నాయని, నాట్య ప్రదర్శనలు..కళ ప్రదర్శనలు..చిన్న వేదుకలు చేసుకునేందుకు కళా భారతి నిర్మాణం పూర్తి చేసామని గుర్తు చేశారు. పూర్తి చేసిన కళాభారతిని ప్రజలకు ఎందుకు అందుబాటులోకి తేలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు దీని మీద సమీక్షా చేసి దీనిని కళాకారులకు అందుబాటులోకి తేవాలని కోరారు. టౌన్ హాల్ శిధిలావస్థలో ఉందని,దానిని తొలగించాలని సూచించారు. వాటి స్థానంలో కార్పొరేషన్ కొత్త భవనం ఏర్పాటు చేయాలనీ ప్రణాళికలు ఉన్నాయన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యాటక శాఖ పరిధిలో పలు పనులు నిలిచి పోయాయని, జూపల్లి వాటిపై సమీక్ష చేసి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఆయన వెంట ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, సీనియర్ నాయకులు నవకాంత్, ఈశ్వరయ్య, జహంగీర్, నరేందర్, గణేష్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



కళాభారతిని సందర్శించిన మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- నెల రోజుల్లో అందుబాటులోకి 140 రకాల వైద్య పరీక్షలు : మేయర్ గుమ్ముల మమత శ్రీనివాస్
- కార్పొరేషన్ పరిధిలో నూతన హెల్త్ క్యాంప్ సెంటర్‌కు శంకుస్థాపన

నూతన హెల్త్ క్యాంపు సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ గుమ్ముల మమత శ్రీనివాస్

మహబూబ్‌నగర్, జూన్ 17, ప్రభాతవార్త: మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో నూతన హెల్త్ క్యాంపు సెంటర్కు మేయర్ గుమ్ముల మమతా శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు. మహబూబ్‌నగర్ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, కార్పొరేషన్ పరిధిలో నూతన హెల్త్ క్యాంప్ సెంటర్ ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్ రామంజులరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో కేవలం ఒక నెల రోజుల్లోనే ఈ భవన నిర్మాణాన్ని -మిగతా4లో..

మహిళలు ఆర్థికంగా ఎదగడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- రెండు కోట్ల 80 లక్షల అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి

వీపనగండ్ల జూన్ 17 ప్రభాతవార్త: మండలంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం నాడు మండలంలోని గోపాల్దిన్నె గ్రామంలో నిర్మించిన 33/11 కెవి సబ్ స్టేషన్ రెండు కోట్ల 12 లక్షల 53000 రూపాయలతో నిర్మించిన సబ్ స్టేషన్ మరియు వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రం లో 16 లక్షల 50 వేల తో ఏర్పాటు చేసిన ఎక్సే మిషన్ను నాబార్డ్ నిధులతో 42 లక్షల కస్తూరిబా పాఠశాలకు అదనపు గదుల నిర్మాణానికి, మహిళా సంఘాలకు బస్సు ప్రభుత్వం ఇచ్చినటువంటి దాన్ని అదేవిధంగా రెండు ఇందిరమ్మ ఇళ్ళను కూడా ప్రారంభించడం జరిగింది.ఈ రకమైనటువంటి తదితర అభివృద్ధి పనులకు ఎక్సైజ్ పర్యాటక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రజా పాలన ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ఎదగడం కోసం వారికి ప్రభుత్వమే కొన్ని పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందని అందులో భాగంగానే బస్సు పెట్రోల్ బంకులు వారు నడుపుకునే విధంగా ప్రభుత్వం వారికి సహకరిస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా గతంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉండేదని ఈ సమస్య నుండి రైతులకు గాని గ్రామాలలో విద్యుత్ దీపాలు వెలగడం కోసంగాని ఇబ్బందులు పడకుండా నాణ్యమైన విద్యుత్తును అందించడం కోసం సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అందులో భాగంగానే గోపాల్ దిన్నె గ్రామంలో 33/11 కెవి సబ్ స్టేషన్ను రైతులకు అంకితం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదే విధంగా రాష్ట్రప్రభుత్వం మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు ఏవైతే ఇవ్వడం జరిగిందో అవి పూర్తి చేసుకునేటటువంటి లబ్ధిదారుల ఇండ్లను ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. దానితోపాటు గ్రామీణ ప్రాంతంలో పేద ప్రజలు ఆరోగ్యపరంగా పెద్దపెద్ద కార్పొరేట్ హాస్పిటల్ పోకుండా ఇక్కడనే వారి ఆరోగ్య పరిస్థితులు మెరుగుపరిచే విధంగా చూసేటందుకోసం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఎక్స రేను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు అదే విధంగా కస్తూరిబా పాఠశాలలో అదనపు గదులు విద్యార్థినిలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు ద్వారా వచ్చినటువంటి నిధులతో చేయడం జరిగిందని ఈ సంవత్సరం కూడా వీపనగండ్ల కస్తూర్బాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరాన్ని ప్రారంభించడం జరుగుతుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు ఈ కాలేజీలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఎం పి హెచ్ డబ్ల్యు కోర్సును ప్రవేశ పెట్టుకోవడం జరిగిందని దానితోపాటు ఎంపీసీ కోర్సు కూడా ఏర్పాటు చేసుకుంటున్నాం అనే దాని కోసం సంతోషం వ్యక్తం చేస్తున్నాను అని తెలిపారు బాలికలు సుదుర ప్రాంతాలకు వెళ్లకుండా వారికి దగ్గరి ప్రాంతాలలో విద్య అందుబాటులో ఉండే విధంగా విద్యను అందించడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. -మిగతా4లో..

బస్సును నడిపి ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

మహిళా సాధికారిత ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

చిన్నంబావి, జూన్ 17 ప్రభాతవార్త: చిన్నంబావి మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి ఆర్టీసీ బస్సులను పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టీరింగ్ పట్టి బస్సును కొద్ది దూరం నడిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు డ్రైవింగ్ చేయడంతో అధికార యంత్రాంగం, కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నిండింది. అనంతరం లబ్ధిదారులతో ముచ్చటించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి, ఆదాయ వనరులు కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళా సంఘాలకు బస్సుల పంపిణీ ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు వారి ఆర్థిక స్వావలంబన మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.మహిళల సంక్షేమం, సాధికారత కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత ముందుకు సాగాలని లబ్ధిదారులకు సూచించారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలని కోరారు.అప్పుడే ఆర్టీసీ లాభాల బాటల్లో పయనిస్తుందని తెలిపారు. మరిన్ని సర్వీసులు గ్రామీణ ప్రాంతాలకు రావడానికి వీలవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్వాసిత రైతులందరికీ న్యాయం చేస్తాం

- ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు అండగా ఉంటాం
- కోర్టు కేసు రైతులు ఆందోళన చెందొద్దు
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 17 ప్రభాతవార్త: ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణం వల్ల భూములు కోల్పోయిన రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి నిర్వాసిత రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసిత రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు పాల్గొని రైతుల సమస్యలను విని,వారికి తగిన న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కోర్టు కేసులు తదితర కారణాల వల్ల పరిహారం పొందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటివరకు 90 నుంచి 95 శాతం నిర్వాసిత కుటుంబాలకు పరిహారం, పునరావాస ప్యాకేజీలు అందించామని, మిగిలిన అర్హుల సమస్యలను కూడా మానవతా దృక్పథంతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి కేసును మానవతా దృక్పథంతో పరిశీలించి అర్హులైన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.సమావేశంలో పలువురు నిర్వాసిత రైతులు గత ప్రభుత్వం తమకు సరైన పరిహారం చెల్లించలేదని, పరిహారం మొత్తాన్ని పెంచాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, అర్హులైన ప్రతి రైతు సమస్యను సమగ్రంగా పరిశీలించి పెండింగ్ పరిహారాలను విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే ఉదండాపూర్ రిజర్వాయర్ మిగిలిన పనులను పూర్తి చేసి, రానున్న ఏడాదిన్నర కాలంలో రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ప్రాజెక్టు పూర్తికి రైతులు సహకరించాలని కోరారు.జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించి, అర్హులైన వారికి పరిహారం అందజేస్తామని తెలిపారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు మాట్లాడుతూ ఇటీవల సోమశిలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి -మిగతా4లో..

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి

హాజరైన అధికారులు

దేవరకద్రలో గాలి బీభత్సం

బొలెరోపై గోడకూలి ఇద్దరు మృతి

బొలేరో వాహనంపై కూలిన గోడ జెసిబితో శకలాలను తొలగిస్తున్న దృశ్యం

దేవరకద్ర,జూన్ 17 ప్రభాతవార్త: బతుకుతెరువు కోసం ఎక్కడి నుండో వచ్చారు... కుటుంబాల కోసం కష్టపడాలని ఆశపడ్డారు... కానీ విధి వారిని మధ్యలోనే కబళించింది. పొట్టకూటి కోసం వచ్చిన ఇద్దరు వ్యక్తులు ప్రమాదంలో ప్రాణాలు వదిలి విషాదాన్ని మిగిల్చారు. బుధవారం సాయంత్రం దేవరకద్రలో గాలి బీభత్సం సృష్టించింది. వడగండ్ల వాన అల్లకల్లోలం చేసింది. ఈ క్రమంలో బొలెరోపై గోడ కూలి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. నిర్మాణంలో ఉన్న ఇంటి పక్కన బొలెరో వాహనం పార్కు చేయగా రెండు అంతస్తులపై నుంచి గాలికి గోడ కుప్ప కూలింది. దీంతో ఆ బొలెరో వాహనం నుజ్జు నుజ్జు కాగా ఇద్దరు వ్యక్తులు అందులోనే ఇరుక్కు పోయారు. వెంటనే అక్కడున్న ప్రజలు, యువకులు, పోలీస్ సిబ్బంది వారిని బయటికి తీశారు. వారికి తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా -మిగతా4లో..

శిక్షణ పొందిన వారికి ఉపాధి

- ప్రతిష్టాత్మకంగా మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రం నిర్వహణ
- మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకుడు గుండా మనోహర్

పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్న గుండా మనోహర్

మహబూబ్‌నగర్, జూన్17 ప్రభాతవార్త: మహబూబ్‌నగర్ ఫస్ట్ పేరుతో శిక్షణ కార్యక్రమాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించి శిక్షణ పొందిన వారికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకుడు గుండా మనోహర్ తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో, మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు ఉచితంగా అందిస్తున్ననైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాల భాగంగా ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గంవర్క్, బ్యూటీషన్ మరియు కంప్యూటర్ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ పొందిన మహిళలకు సంబంధించి ఫైనల్ పరీక్షలను ప్రతిష్టాత్మక సంస్థ అయిన సెట్విన్ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో విజయవంతంగా నిర్వహించడం జరిగింది. గత మూడునెలలుగా నిష్ణాతులైన అధ్యాపకుల చేత శిక్షణ పొందిన మహిళలు ఎంతో ఆసక్తి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరయ్యారు. ఎమ్మెల్యే ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహబూబ్ నగర్ ఫస్ట్ శిక్షణ సెంటర్ ద్వారా ఇప్పటి వరకు నాలుగు బ్యాచ్‌ల వారికి శిక్షణ అందించగా, ఇప్పటికే చాలామంది మహిళలు సొంతంగా ఉపాధి అవకాశాలు పొందడమే కాకుండా ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని,బ్యాంకుల ద్వారా రుణాలు కూడా కొందరు -మిగతా4లో..

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక
- పల్స్ పోలియో, స్టాప్ డయేరియా, ఎన్‌డీడీ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష

నారాయణపేట, జూన్ 17 ప్రభాతవార్త : నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కే. జయచంద్ర మోహన్ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్ ఫోర్స్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్టాప్ డయేరియా, పల్స్ పోలియో,నేషనల్ డీవార్మింగ్ డే (ఎన్‌డీడీ) కార్యక్రమాల అమలుపై సమీక్షించారు జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయిరాం మాట్లాడుతూ స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు అందజేస్తామని తెలిపారు వాంతులు, విరేచనాలతో బాధపడే చిన్నారులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.పల్స్ పోలియో కార్యక్రమం జూన్ 28 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలు 53,667 మంది ఉన్నారని,వారికి అందించేందుకు 72 వేల వ్యాక్సిన్ డోసులు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. జూన్ 28న బూత్ స్థాయిలో పోలియో చుక్కలు వేయడంతో పాటు, 29, 30 తేదీల్లో పోలియో తీసుకోని పిల్లల కోసం ఇంటింటి సర్వే నిర్వహించి చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. నేషనల్ డీవార్మింగ్ డే కార్యక్రమంలో భాగంగా 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయనున్నట్లు వివరించారు. రెండవ సంవత్సరం పిల్లలకు సగం మాత్ర,3 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్ర అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా -మిగతా4లో..

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్

భూత్పూర్,జూన్ 17,ప్రభాతవార్త : భూత్పూర్ మండలం కరివెన,వెల్కిచర్ల గ్రామాల్లో బుధవారం ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నిర్మితమైన ఇందిరమ్మ ఇళ్లను దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ ఇంది రమ్మ ఇళ్ల లబ్ధిదారులైన దంపతులకు నూతన వస్త్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ పేదొడి సొంతింటి కలను నిజం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందించి చేయూతనిస్తోందన్నారు. అర్హులైన పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందడి నర్సింహారెడ్డి,భూత్పూర్‌మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, వెల్కిచర్ల సర్పంచి రమేష్,పోతులమడుగు సర్పంచి ఆనంద్‌రెడ్డి,భట్టుపల్లితండా ఏవీఆర్‌కాలనీ సర్పంచి తారునాయక్,ఉపసర్పంచి సభావత్ జైపాల్‌నాయక్, కొత్తమొల్గర సర్పంచి మలిశెట్టి వెంకటేష్,కప్పెట సర్పంచి మాసగౌడ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు హరియా నాయక్,భూపతిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌పై దిశా నిర్దేశం...

గోపాల్ పేట్ జూన్ 17 ప్రభాతవార్త : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పై బూత్ లెవల్ ఏజెంట్లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులతో గోపాల్‌పేటలో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల మండలాల ఇన్‌చార్జి ఇటిక్యాల సత్యా రెడ్డి, గోపాల్ పేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంద సత్యశీల రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గగనం నరహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎస్ ఐఆర్‌పై అవగాహన కల్పించారు. ప్రతి బూత్‌లో ఇంటింటికీ వెళ్లి ఓటు నమోదయ్యేలా చూడాలి. అర్హులైన ఒక్కఓటు కూడా తొలగిపోకుండా చూడాలి. సరైన పత్రాలు లేని ఓటర్లను తొలగించే ప్రమాదం ఉంది. కాబట్టి బిఎల్ఏలు వారికి పూర్తి సహకారం అందించి ఓటరుగా గుర్తింపు పొందే బాధ్యత తీసుకోవాలి. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారుజిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొంకి వెంకటేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ ఆర్టిఐ చైర్మన్ కొంకి రమేష్, బ్యాదరి శాంతయ్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎండీ బాలపీరు, కేతేపల్లి వెంకటయ్య, మాజీ వైస్ ఎంపీపీ శేఖర్, న్యాయవాది యం.ఆంజనేయులు, అబ్దుల్లా, వివిధ గ్రామాల సర్పంచులు బంగారయ్య, పీర్య నాయక్, వడ్డేమాన్ శివ, కావెల రాములు, చరణ్ కుమార్, కొంకలి కృష్ణయ్య, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, బిఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇంచార్జి ఇటిక్యాల సత్యా రెడ్డి

డీ.సెట్ వెబ్ ఆప్షన్స్‌కు ఈనెల 20 ఆఖరు తేదీ

మహబూబ్‌నగర్, జూన్ 17 ప్రభాతవార్త : ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిఈఈ సెట్ 2026లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలనకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవడానికి సిద్ధంగా ఉండాలని మహబూబ్‌నగర్ జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ మహమ్మద్ మేరాజుల్లా ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. డిఈఈ 2026,28 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం తెలుగు / ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలో అడ్మిషన్ కొరకు ఫస్ట్ ఫేస్, సెకండ్ ఫేస్ కు హాజరుకానీ అభ్యర్థులు వారి వారి ధ్రువపత్రములు పరిశీలనకు గురువారం వారి ఒరిజినల్ ధ్రువపత్రాలు, జిరాక్స్ లు తీసుకొని రావాలన్నారు. వెబ్ ఆప్షన్స్ పెట్టుకునేందుకు ఈ నెల 19, 20 తేదీల్లో అవకాశం ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ మేరాజుల్లాఖాన్ తెలిపారు. పూర్తి వివరాల కోసం సెల్ : 9949993714 సంప్రదించాలని కోరారు.

మండల స్థాయి బిఎల్ఓలకు శిక్షణ

నవాబుపేట,జూన్ 17 ప్రభాతవార్త : ఎన్నికల కమిషన్ ఆదేశాలు మండలంలోని మండల వ్యాప్తంగా 42 గ్రామాలకు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల బూత్ లెవెల్ ఆఫీసర్‌లకు బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో మండల అధికారులు తహసిల్దార్ సురేష్, ఎంపీడీవో జయరాం నాయక్, ఆర్ఐ రామాంజనేయులు పర్యవేక్షణలో శిక్షణ తరగతులు నిర్వ హించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సురేష్ ఎంపీడీవో జయరాం నాయక్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల బిఎల్ఓలకు బిఎల్ ఏలకు శిక్షణ తరగతులు నిర్వహించామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని దేశ ,రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో బిఎల్ఓలు సన్నద్ధం కావాలని సూచించారు. ఇందులో బూత్ లెవెల్ ఆఫీసర్స్ ప్రముఖ పాత్ర ఉంటుందని అన్నారు. గ్రామాలలో అర్హులైన యువకులు ఉంటే వారిని ఎన్నికల గుర్తింపు కార్డులు వచ్చే విధంగా అవగాహన చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు మండలంలోని అన్ని గ్రామాల బి ఎల్ ఓ లు తదితరులు బిఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసిల్దార్, ఎంపిడిఓ

హాస్టల్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

అచ్చంపేట,జూన్ 17 ప్రభాతవార్త: బల్మూరు మండలం కొండనాగులలో శ్రీ ఉమామహేశ్వర డిగ్రీవిద్యార్థులకు హాస్టల్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణకి డిగ్రీ కళాశాల యాజమాన్యంతో కలిసి వినతిపత్రం అందించడం జరిగిందని ప్రిన్సిపాల్ పరంగి రవి తెలిపారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు హాస్టల్ సౌకర్యం ఎంతో అవసరమని, ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికిస్పందించిన ఎమ్మెల్యే విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, హాస్టల్ ఏర్పాటుకోసం అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య నరసింహారావు, వెంకటయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం

అచ్చంపేట, జూన్,17 ప్రభాతవార్త: అచ్చంపేట నియోజకవర్గం బల్మూర మండలం కొండనాగుల గ్రామంలోని ఎంపిపిఎస్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి వారి విద్యాభ్యాసానికి శుభారంభం చేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకొని భవిష్యత్తులో మంచిపౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యా అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతివిద్యార్థికి నాణ్యమైన విద్యఅందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకూ పాఠ్యపుస్తకాలను నోట్‌బుక్కులను అందజేశారు. కార్యక్రమంలో స్థానికసర్పంచ్ కాట్రాజ్ పద్మ, స్థానికనాయకులు కార్యకర్తలు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నోట్ బుక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఉపాధ్యాయుల సహకారం అభినందనీయం

ఉప్పునుంతల, జూన్ 17 ప్రభాతవార్త : మండలంలోని వెల్టూరు ప్రాథమిక పాఠశాలలో 4,5వ తరగతి విద్యార్థుల కోసం వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు ఆధ్వర్యంలో బెంచీలు అందజేయడం అభినందనీయమని ఆ పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విద్యార్థులు పాఠశాలలో కూర్చోవడానికి కల్పించిన సౌకర్యం, వారి సహకారం తాము మరువలేమని తమ పాఠశాల విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకునే అవకాశం కలిగించిన ప్రతి ఒక్కరికి అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. తమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థికి అంకితభావంతో ముందుకు వచ్చిన హై స్కూల్ హెచ్ఎం ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ లు పాఠశాల బృందానికి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, కపిలవాయి విష్ణు మూర్తి వారికి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రుల తరుఫున ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

పాఠశాలకు బెంచీలు వితరణ చేస్తున్న దృశ్యం

సొంతింటి కలను నెరవేర్చిన ప్రభుత్వం

చిన్నచింతకుంట, జూన్ 17 ప్రభాతవార్త : తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చిందని ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు తెలిపారు. బుధవారం ఏదులాపూర్ గ్రామంలో శంకరమ్మ మాసన్న గౌడ్ గారి ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒక వరం లాంటిదని ఆయన తెలిపారు. మాకు సొంతింటి కలను నెరవేర్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి లకు ఇందిరమ్మ గృహ యజమాని శంకరమ్మ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ,పంచాయతీ కార్యదర్శి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గృహప్రవేశంలో పాల్గొన్న ఎంపీడీవో

మక్తల్‌లో విద్యుత్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి

కిందకు వేలాడుతున్న తీగలే కారణమని స్థానికుల ఆగ్రహం

మక్తల్ టౌన్, జూన్ 17 ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధిలోని నందిని నగర్‌లో బుధవారం విషాదం చోటుచేసుకుంది. మసాలా ప్యాకెట్ల లోడుతో వచ్చిన లారీపై కప్పిన ప్లాస్టిక్ కవర్ తొలగిస్తుండగా, కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో డ్రైవర్ కుర్వ వెంకటేష్ (25) విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గద్వాల్ మున్సిపాలిటీ దౌదర్‌పల్లి 7వ వార్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన వెంకటేష్ గత నాలుగేళ్లుగా లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం గద్వాల్ నుంచి మక్తల్‌కు లోడుతో వచ్చిన లారీపై కవర్ తీస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తోటి హమాలీలు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. వెంకటేష్‌కు భార్య, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు.

నిర్లక్ష్యంపై ప్రశ్నలు: మక్తల్‌లో పలుచోట్ల విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరమ్మతులు కాంట్రాక్టర్లపై ఆధారపడి ఉన్నాయని అధికారులు చెబుతున్నారని వాపోయారు. ఇటీవలే ఈ సమస్యపై వార్తలు వచ్చినా చర్యలు లేకపోవడంతోనే ఈ దుర్ఘటన జరిగిందని మండిపడుతున్నారు. ఈ ప్రమాదానికి బాధ్యులు ఎవరని, నిరక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబానికి ఆధారమైన వెంకటేష్ మృతితో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

ప్రమాదఘటన కుగురైన లారీ

వెంటనే చర్యలు అవసరం...

వెంకటేష్ మరణం మక్తల్ విద్యుత్ వ్యవస్థకు ఒక హెచ్చరిక. ఇకనైనా జిల్లా కలెక్టర్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించాలి. పట్టణంలోని అన్ని ప్రమాదకర లైన్లను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి. శిథిల స్తంభాలను మార్చాలి లేకుంటే రానున్న రోజుల్లో మరిన్ని ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ప్రజాధనంతో పాటు ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనని మక్తల్ ప్రజలు గుర్తుచేస్తున్నారు.

బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం...

ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జ్ ఐ.సత్యా రెడ్డి,

అధ్యక్షులు పందెం సుఖేందర్ రెడ్డి

ఉమ్మడి గోపాల్ పేట

మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎం.సత్యశీల రెడ్డి

గోపాల్ పేట్ జూన్ 17 ప్రభాతవార్త : ఏదుల మండల కేంద్రంలో మండల కమిటీ ఏర్పాటైన తర్వాత మొదటి ముఖ్య సమావేశం (మండల ఎగ్జిక్యూటివ్ మీటింగ్) అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశం ఏదుల మండల అధ్యక్షులు పందెం సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జ్ ఐ.సత్యా రెడ్డి, ఉమ్మడి గోపాల్ పేట మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎం. సత్యశీల రెడ్డి హాజరై ప్రసంగించారు. క్షేత్రస్థాయిలో బూత్ లెవల్ ఏజెంట్లదే కీలక పాత్ర మండల కమిటీ ఏర్పాటైన తదనంతరం జరిగిన ఈ మొదటి ప్రాముఖ్య సమావేశంలో ముఖ్యంగా బూత్ లెవల్ ఏజెంట్ల ప్రాధాన్యతను నేతలు వివరించారు. ఏజెంట్లు క్షేత్రస్థాయిలో చేయాల్సిన పనులు, బాధ్యతలను గుర్తుచేశారు. భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన విధివిధానాలను, పార్టీబలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ను వారికి క్షుణ్ణంగా తెలియజేశారు. హాజరైన ముఖ్య నాయకులుఈ ప్రతిష్టాత్మకకార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్నవారిలో గుంటి సురేందర్ (మార్కెట్ యార్డ్ డైరెక్టర్), శేఖర్ రావు (మండల ఉపాధ్యక్షులు), కోడిగంటి రామచందర్ (మండల ప్రధాన కార్యదర్శి), దొడ్ల వెంకట స్వామి, ఎద్దుల జనార్దన్ రెడ్డి, బొల్లి వెంకట జానకి రాముడు (స్పోక్ పర్సన్), రాములు యాదవ్ ,బంకల అజయ్, మండల అభ్యున్నతి కమిటీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

గ్రామా అభివృద్ధే.. దేశ అభివృద్ధికి ప్రతిబింబం..

వనపర్తి మండల పార్టీ అధ్యక్షులు నక్క రవి కిరణ్

గ్రామ అభివృద్ధికి నిధుల కేటాయింపు

హర్షం వ్యక్తం చేసిన మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ ప్రజలు

వనపర్తి, జూన్ 17, ప్రభాతవార్త: గ్రామ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడంతో మండల పార్టీ అధ్యక్షులు నక్క రవి కిరణ్‌తో పాటు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రవి కిరణ్ మాట్లాడుతూ నిధులతో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మార్గం సుగమమైందని వారు పేర్కొన్నారు. గ్రామంలో రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి గ్రామాలలో చేపట్టిన మార్నింగ్ వాక్ కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేశారని అన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమని మండల పార్టీ అధ్యక్షులు అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు పడద్దని నాలుగు గ్రామాలలో కోటి 20 లక్షలతో గోదాములను నిర్మించేందుకు నిధులు కేటాయించడం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జరిగిందన్నారు. అలాగే మహిళా సమైక్య భవనాలను, అంగన్వాడి కేంద్రాల శాశ్వత భవనాలను, శిథిలావస్థలో ఉన్న గ్రామపంచాయతీ కార్యాలను నిర్మించుకునేందుకు మండల పరిధిలో దాదాపుగా 3 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించడం కోసం నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి, అభివృద్ధి పనులు పూర్తయితే గ్రామ రూపురేఖలు మారడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సహదేవు, శివకుమార్, బుచ్చా నాయక్, అబ్దుల్లా, సురేష్ పలువురు పాల్గొన్నారు.

నారాయణపేట డీసీసీ నూతన కార్యవర్గం ప్రకటన

పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారమే

లక్ష్యం : కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి

నారాయణ పేట, జూన్ 17 ప్రభాతవార్త : నారాయణపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి పలు అంశాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యుల పేర్లను అధికారికంగా ప్రకటించినట్లు తెలిపారు. జిల్లా కాంగ్రెస్‌పార్టీని మరింత బలోపేతంచేయడం, సంస్థాగత అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో నూతన కార్యవర్గ సభ్యులు కీలక పాత్ర పోషించాలని కోరారుజ రానున్న వారంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, సంస్థాగత కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై కార్యాచరణ, భవిష్యత్ పార్టీ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా ఓబీసీ చైర్మన్ గొల్ల కృష్ణ, పంచాయతీరాజ్ సంఘటన జిల్లా

మాట్లాడుతున్న కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి

అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు సలీం, నూతన మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అనిల్ కుమార్, కొక్కు శంకర్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా నియమితులైన జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు అంకితభావంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

వెల్టూర్‌లో పీర్ల చావిడి నిర్మాణానికి ఆర్థికసాయం అందజేత

ఉప్పునుంతల, జూన్ 17 ప్రభాతవార్త : మండలంలోని వెల్టూరు గ్రామంలో పీర్ల చావిడి నిర్మాణానికి గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ ఆర్థిక సహాయం అందజేశారు. కుల మతాల కు అతీతంగా జరుపుకునే మొహరం వేడుకల సందర్భంగా నూతన పీర్ల చావిడి నిర్మాణానికి తన వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామంలో సోదరా భావంతో, ఐక్యత చాటుకుని మొహరం పండుగ వేడుకలు ఘనంగా జరుపుకునే విధంగా అందరు సహకరించాలని, శాంతియుతంగా మొహరం వేడుకలు విజయవంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధి కోసం తాను ఎల్లప్పుడూ చేస్తానని పేర్కొంటూ, ఐక్యతగా జరుపుకునే మొహరం వేడుకలు గ్రామంలో శాంతియుత వాతావరణంలో విజయవంతంగా జరుపుకోవాలని ప్రతి ఒక్కరు మొహరం వేడుకలు విజయవంతంగా ముగిసే వరకు కృషి చేయాలని సర్పంచ్ కోరారు. గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ అందించిన సహకారం అభినందనీయమని, భవిష్యత్తులో గ్రామ ప్రజలకు సేవ భవాని, సామాజిక బాధ్యత అందిస్తూ అందరికి సహకరించాలని మైనార్టీ సోదరులు సర్పంచుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఆర్థిక సహాయం అందజేస్తున్న వారిలో గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ తో పాటు ఉప సర్పంచ్ ఉప్పరి మల్లేష్, వార్డు సభ్యులు పుట్ట మల్లయ్య,

వెల్టూర్‌లో మైనారిటీ సోదరులకు

ఆర్థిక సహాయం అందజేస్తున్న గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్

సుంకరి మోనిక నాగరాజు, గ్రామస్తులు పద్మనాభ రెడ్డి, జనార్దన్ రెడ్డి, జానయ్య, మోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సర్వేశ్వర్, మైనార్టీ సోదరులు ఆజిమొద్దీన్, కరీం, నాగూర్ పాషా, నీలి, అబ్బు, గౌస్ రాములు, నీరంజన్, సయ్యద్, బాబా, షకీల్, తరుణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

అచ్చంపేట, జూన్,17 ప్రభాతవార్త: బాధిత కుటుంబానికి రూ, పదివేలు సహాయం అందించడం జరిగిందని తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు గాలిగూటి జగదీష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో వలపట్ల కాలానికి చెందిన మేస్త్రీ యాదయ్య ఇటీవల మరణించడం జరిగిందని తెలిపారు. బుధవారం సంఘం సభ్యులతో కలిసి బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సూర్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిచంద్ర, సంఘం నాయకులు అర్జున్, సాంబశివ రావు, ఎల్లికంటి నిరంజన్, రామ్ చందర్, శ్రీనివాసులు ఉన్నారు.

సుమన్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

స్నేక్ క్యాచర్ సుమన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

అచ్చంపేట, జూన్,17 ప్రభాతవార్త: స్నేక్ క్యాచర్ సుమన్ చేస్తున్న సేవలను గుర్తించి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గురువారం సుమన్ ను శాలువాతో సన్మానించి ప్రశంస పత్రం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్నేక్ క్యాచర్ సుమన్ ఒక ప్రభుత్వఉద్యోగిగా విధులు నిర్వహిస్తూఎక్కడైనా ఎవరి ఇంటివద్దైన పాము ఉన్న సమాచారం తెలిపితే క్షణాల్లో అక్కడికి వెళ్లి పామును బంధించి అడవిలో వదులుతాడు. అటు జంతులను సర్పాలను కాపాడుతూ ప్రజలకు ఎలాంటి హానీ కలగకుండా చూస్తున్నారు. వీరి సేవలు అమోగమని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అభినందించారు. వారితో పాటు డా. మహేష్ ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో కంటి వైద్య పరీక్షలు

కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

చిన్నచింతకుంట, జూన్ 17 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. జిల్లా అందత్వ నివారణ సంస్థ, ఎం రామ్ రెడ్డి కంటి లయన్స్ ఆసుపత్రి సంయుక్తంగా ఈ కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు 60 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించగా 24 మంది కంటి రోగులకు కంటి ఆపరేషనన్లకు గాను ఎమ్.రాంరెడ్డి కంటి లయన్స్ ఆసుపత్రికి పంపించడం జరిగిందని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు శిరీష తెలిపారు.

అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం..

ఏక్ పేడ్ మాకేనామ్ పోస్టర్

ఆవిష్కరించిన డిఈఓ ఐ.విజయకుమారి

ఏక్ పేడ్ మాకేనామ్ పోస్టర్ ఆవిష్కరించిన డిఈఓ

మహబూబ్‌నగర్, జూన్ 17 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటాలని మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ లైఫ్ కార్యక్రమం ఎకో క్లబ్స్ లో భాగంగా కాలుష్య నియంత్రణ కోసం అన్ని పాఠశాలల్లో, ఖాళీ ప్రదేశాల్లో అమ్మ పేరు మీదుగా ప్రతి ఒక్కరు ఒక చెట్టును నాటి ఏకో క్లబ్స్ ఎడ్యుకేషన్, జిఓవి . ఇన్ వెబ్సైట్లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. రోజు రోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించడానికి ప్రభుత్వము ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఎమ్ఓ దుంకుడు శ్రీనివాస్, డీఎస్ఓ షంషీర్, ఎంఈఓ మంజులత పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల పంపిణీ

సర్పంచు చేతుల మీదుగా దుస్తుల పంపిణీ

ఉప్పునుంతల, జూన్ 17 ప్రభాతవార్త : మండలంలోని కంసాని పల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులకు గ్రామ సర్పంచ్ చీమర్ల లలిత వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిన్నారులను అంగన్‌వాడి కేంద్రాలలో చేర్పించాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు చీమర్లలలితవెంకటేశ్వర్లు సూచించారు. అదేవిధంగా అంగన్వాడి కేంద్రాలకు ప్రభుత్వం నుంచి వస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నపిల్లలకు అందేలా అంగన్వాడి కార్యకర్తలు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచు చీమర్ల లలిత వెంకటేశ్వర్లు తోపాటు ఉపసర్పంచ్ పోల జితేందర్, ఉపాధ్యాయులు కట్ట నర్మద, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పావని, చిన్నారులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

లింగాల, జూన్ 17, ప్రభాతవార్త : మండల పరిధిలోని అప్పాయి పల్లి గ్రామానికి చెందిన బిర్రు పుల్లమ్మ ఇటీవల మృతి చెందారు. సంఘటన ను తెలుసుకున్న అప్పాయిపల్లి మాజీ సర్పంచ్ రవీందర్ నేతృత్వంలోని మనం మన బాధ్యత ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబానికి 5 వేల రూపాయల నగదు, 25 కేజీల బియ్యాన్ని 7వ వార్డు ఇంచార్జ్ దుగ్గి అశోక్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి తమ వంతు ఆర్థిక సాయాన్ని అందించామని, భవిష్యత్తులో కూడా వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలలో 8వ వార్డు సభ్యులు నెల్లికుదురు నరేష్, తొమ్మిదో వార్డు సభ్యులు నరేష్, బిజెపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు, ఆరవ వార్డు సభ్యులు యాదగిరి సలేశ్వరం, నిరంజన్, చుక్క శ్రీనివాస్ శేఖర్ పెబ్బేటి, శారద, రాముడు, రాజు గౌడ్, కొరుపాల మహేష్, పంబ మహేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు, ప్లేట్లు వితరణ

విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు, ప్లేట్లు అందజేసిన సర్పంచ్

శ్రీరంగాపూర్, జూన్ 17 ప్రభాతవార్త : శ్రీరంగాపూర్ మండలంలోని నగరాల రెండో సెంటర్ పాఠశాల నందు బుధవారం సర్పంచు గుంటి మహదేవ్ తమ మాతృమూర్తి గుంటి కృష్ణమ్మ 14వ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్ పలకలు ప్లేట్స్ అందజేయడం జరిగింది. గుంటి మహదేవ్ మాట్లాడుతూ విద్యార్థులు అందమైన పాఠశాల జీవితాన్ని సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరాల గ్రామ సర్పంచ్ గుంటి మహాదేవతో పాటు శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి, ఉపాధ్యాయుల బృందం వార్డ్ మెంబర్ కురుమూర్తి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతి రెడ్డి, నరేష్ కుమార్, గొల్ల కృష్ణయ్య, భాను, బీచ్‌పల్లి, లక్ష్మీనారాయణ, గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అవుసలికుంట వాసికి బనారస్ హిందూ యూనివర్సిటీలో సీటు

వంగూరు బాలరాజు

లింగాల, జూన్ 17, ప్రభాతవార్త : చదువుకు పేదరికం అడ్డు ఆటంకం కాదని చదవాలని ఆకాంక్ష బలంగా ఉన్నప్పుడు ఎంతటి ఉన్నత లక్ష్యాన్ని అయినా సులువుగా సాధించవచ్చునని నిరూపిస్తూ ప్రతిష్ఠాత్మకమైన బనారస్ హిందూ యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీలో సీటు సాధించి అందరికి ఆదర్శంగా నిలిచాడు అవుసలికుంటవాసి వంగూరు బాలరాజు. వివరాలలోకి వెళితే నల్లమల అటవీ ప్రాంతంలోని లింగాల మండల పరిధిలోని అవుసలికుంట గ్రామానికి చెందిన వంగూరుబాలస్వామి లక్ష్మీదేవమ్మ దంపతుల కుమారుడైన వంగూరు బాలరాజు భారతదేశంలోనే బనారస్ హిందూ యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ (ఎంఏ తెలుగు)లో ప్రవేశం పొందడం పట్ల ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బంగారయ్య బుధవారం హర్షం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ చిన్నప్పటి నుంచి బాలరాజు చదువులో చురుకుదనం చూపిస్తూ అంచలంచలుగా ఎదిగి అందరికి స్ఫూర్తిదాయకంగా ఉన్నత లక్ష్యాన్ని సాధించాడని గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు, పలువురు అభినందనలు తెలుపుతూ మిఠాయిలను పంచి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

కేశ్వాపూర్‌లో సామూహిక అక్షరాభ్యాసం

అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కోయిల్‌కొండ జూన్ 17, ప్రభాతవార్త: కోయిలకొండ మండలం కేశవాపూర్ గ్రామంలో గల పాఠశాలలో బుధవారం చిన్నారి విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రాణిచంద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఉచిత పలకలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అక్షరాభ్యాస కార్యక్రమానికి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేష్ చారి, పాఠశాల హెచ్ఎం కిష్టప్ప పాల్గొని ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థులందరికీ సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడ జరుగుతుందన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు అందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం

మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

వెల్దండ, జూన్ 17 ప్రభాతవార్త : చదువులతో పాటు క్రీడలు ఎంతో అవసరమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని కొట్ర గ్రామంలో మాస్టర్ కుమార్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలో కరాటే వేసవి శిక్షణ ముగింపు బెల్టుల ప్రధానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కరాటే విద్యార్థులకు బెల్టులు ప్రధానం చేసి, విద్యార్థు లు యువత కరాటే నేర్చుకోవ డంవలన శారీరకదృఢత్వం మానసికఉల్లాసం ఆత్మరక్షణ నైపుణ్యా లు పెంపొందుతాయని బాలికల కరాటేశిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని ఆపదసమయంలో మనల్ని మనం కాపాడు కోవడంతోపాటు ఇతరులను కూడా కాపాడడానికి ఎంతో దోహదపడతా యని శిబిరాన్ని విజయవంతంగా నడిపించిన మాస్టర్‌కుమార్‌ను అభినందించారు.

ఐఐటీలో సీట్ సాధించిన విద్యార్థిని సన్మానించిన గోలి శ్రీనివాస్ రెడ్డి

మండల కేంద్రానికి చెందిన కూన శ్రీనివాసులు పద్మా దంపతుల రెండవ కుమార్తె కూన ఇషిత ఇటీవల వెల్లుబడిన ఐఐటి ఫలితాలలో తన ప్రతిభ చాటి అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో ఐఐటీ సీటు సాధించిన సందర్భంగా మండల కేంద్రంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి రిషితను శాలువాలతో సన్మానించి అభినందించారు. రానున్న రోజులలో ఉన్నత స్థాయిలో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పుట్టా రాంరెడ్డి, అనిల్ కుమార్, జోగయ్య, నాగులు నాయక్, నిరంజన్, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, వెంకటయ్య, శివ, అశోక్ తో పాటు తదితరులు ఉన్నారు.

ధన్వాడలో జోరుగా బడిబాట ప్రచారం

బడిబాట ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ధన్వాడ, జూన్ 17 ప్రభాతవార్త : విద్యార్థుల నమోదు పెంపు లక్ష్యంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ధన్వాడ ఆధ్వర్యంలో బడిబాట ప్రచార కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమం ద్వారా సమీప గ్రామాలు, కాలనీల్లో విద్య ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ ఎం. ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ప్రతి బాలుడు పాఠశాలకు హాజరవ్వడం ఎంతో ముఖ్యమని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు పలు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ బృందం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల నమోదు చేపడుతూ, మధ్యలో చదువు మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలకు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా విద్యా హక్కు ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని బడిబాటను విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారు.

సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐఆర్ జోనల్ ఇంచార్జ్ అహన్య రాజు

వనపర్తిరూరల్, జూన్17, ప్రభాతవార్త: ప్రత్యేక సమగ్రఓటర్ జాబితా సవరణ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం కార్యక్రమం కాదని ప్రతి 20 ఏళ్లకు ఒకసారి సాధారణంగా జరిగే ప్రక్రియ అని ఎస్ఐఆర్ జోనల్ ఇంచార్జ్ ఇంటలెక్చువల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ అహన్య రాజు అన్నారు. బుధవారం బిజెపి జిల్లాకార్యాలయంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణపై జిల్లా అధ్యక్షులు డి.నారాయణ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా ఎస్ఐఆర్ కార్యశాల నిర్వహించడం జరిగింది. ఈ జిల్లా కార్యశాలకు ముఖ్యఅతిథిగా ఎస్ఐఆర్ జోనల్ ఇన్చార్జి ఇంటలెక్చువల్ సెల్ రాష్ట్రకన్వీనర్ అహన్య రాజు హాజరై మాట్లాడుతూ జూన్ 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సమగ్ర ప్రత్యేక ఓటర్ జాబితా సవరణలో వనపర్తి జిల్లాలోని బిఎల్ఎ2 లు ఎస్ఐఆర్ జాబితా సవరణ అధికారులతో పాటు తప్పనిసరిగా సమయం ఇవ్వాలని తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఎన్యుమరేటర్లు ప్రతిరోజు 20 ఇండ్లను పరిశీలన చేస్తారని పరిశీలన చేసే సమయంలో బిఎల్ఓతో పాటు ప్రతి రాజకీయ పార్టీ నుంచి బిఎల్ఎ 2లు తప్పనిసరిగా వారితో పాటు ఉండి దొంగ ఓట్లు, అర్హత లేని ఓట్లను గుర్తించి అభ్యంతరం తెలియజేయాల్సిన బాధ్యత బిఎల్ఏ 2కు ఉంటుందని తెలియజేశారు. భారతీయ జనతా పార్టీఒక వర్గానికో, ఒక సమూహానుకో వ్యతిరేకం, అనుకూలం కాదని సమాజంలోని అన్ని వర్గాల వారిని, అన్ని సమూహాల ప్రజలను కలుపుకొని వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని అన్నారు. భారతదేశంలో పుట్టిన ప్రతి పౌరుడికి ఓటరుగా నమోదయ్యే అర్హత ఉంటుందని ముష్కరులు, ఇతర దేశాల నుంచి అక్రమంగా వలస వచ్చిన వారు, దొంగచాటుగా ఓటర్లుగా నమోదయ్యే విషయాన్ని పూర్త సమీక్షించడానికి ఎస్ఐఆర్ నడుస్తుందని పేర్కొన్నారు. జూన్ 25 నుండి సెప్టెంబర్ 30వ తేదీ లోపు తెలంగాణ రాష్ట్రంలో అక్రమ ఓట్లు ఎవరు నమోదు చేసుకున్న వలసవాదులు, డబల్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు పూర్తిగా తొలగించి అక్టోబర్1 న పూర్తిగా ఓటరు జాబితా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యశాలలో బిజెపి జిల్లా రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, బి. శ్రీశైలం, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్.లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి, జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు పెద్దిరాజు, శ్రీనివాస్ గౌడ్ ,వారణాసి కల్పన, జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అన్నిరకాల సౌకర్యాలు ఏర్పాటు

తాడురులో ప్రైవేట్ పాఠశాల విద్యార్థి కి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం అందజేస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం జటప్రోలు శ్రీనివాస్ రెడి

ఉప్పునుంతల, జూన్ 17 ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కాంప్లెక్స్ హెచ్ఎం, పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తాడురు పాఠశాల లో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గతంలో ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు తాడురు పాఠశాలలో ప్రవేశాలు పొందడం తోవారికి అడ్మిషన్లుకల్పిస్తూ ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులకు మౌలికవసతులు, నాణ్యమైన విద్య, పుణాత్మకమైన వైఖరులను ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను తీర్చిదిద్దుతారని తాడురు పాఠశాలలో అద్భుతంగా ఉపాధ్యాయులు విద్యనందిస్తున్నారని ఆయన ప్రశంసించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్యతోపాటు ఉచితంగా అందజేస్తున్న పథకాలను అందుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అలివేల ఎల్లయ్య, ఉప సర్పంచ్ అశోక్ గౌడ్, ఆ పాఠశాల హెచ్ఎం రామస్వామి, తిరుపతయ్య యాదవ్, మాజీ సర్పంచ్ అలివేల కృష్ణయ్య, చంద్రయ్య, శ్రీకాంత్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవదారి కుంటతండాలో... మండలంలోని దేవదారి కుంట తండా లో పాఠశాల హెచ్ఎంరత్నప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షర భ్యాసానికి గ్రామసర్పంచ్ మంగమ్మ రతన్‌సింగ్‌లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వారి చేతుల మీదుగా అక్షర భ్యాసం చేయించారు. గ్రామ సర్పంచ్ మంగమ్మ రతన్ సింగ్, పాఠశాల హెచ్ఎం రత్న ప్రసాద్, అంగన్ వాడీ కార్యకర్తలు సోనమ్మ ,సరోజ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

మదిగట్ల ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం

పెద్దమందడి, జూన్ 17 ప్రభాతవార్త : పెద్దమందడి మండలంలోని మదిగట్ల ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాజ్ ఉపాధ్యాయులు బి.రమేష్, ఏ.విష్ణు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మండల విద్యాధికారి ఎస్.మంజులత పాఠశాల సముదాయ గజిటెల్ ప్రధాన ఉపాధ్యాయులు వరప్రసాద్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో సరస్వతి మాత చిత్రపటానికి మండల విద్యాధికారి మంజులత పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు పలకలు బలపాలు బహుమతులు అందజేసి అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన మండల విద్యాధికారి శ్రీమతి మంజులత ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ విద్యా సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల సముదాయ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు యేసు వరప్రసాద్ రావు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందని తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు డిజిటల్ తరగతులకు పాటు నాణ్యమైన విద్య బోధన అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, పలకలు, బలపాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేయగా అనంతరం చాక్లెట్లు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆయాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమం

ఏదుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పందెం సుఖేందర్ రెడ్డి

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

గోపాల్ పేట్ జూన్ 17 ప్రభాతవార్త : ఏదుల మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినటువంటి విద్యార్థి విద్యార్థినులకు ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోపాల్‌పేట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శశిధర్, ఏదుల మండల ఎంపీడీవో రఘు రాములు, ఏదుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పందెం సుఖేందర్ రెడ్డి పాల్గొని విద్యార్థిని, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. అలాగే ఎస్సై శశిధర్ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు అందరూ సోషల్ మీడియాకు బానిసలు కావద్దు, చెడుఅలవాట్లకు అలవాటు పడద్దు మంచిగా చదువుకోవాలి చదువుకొని వారియొక్క కుటుంబాల యొక్క ఆర్థిక స్థితిగతులను మార్పు చెల్లించాలని చదువుఒక్కటే ఈ సమాజాన్ని మార్చుతుంది అన్నారు. అలాగే స్కూల్‌కు సంబంధించి అన్ని రకాలుగా సహాయం చేస్తానని మత్తు పదార్థాలు ఎవరు తీసుకోవద్దని ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని చెప్పడం జరిగింది. వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కూడా తెలిపారు. ఏదుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పందెం సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ కూడా వందకు వంద శాతం ఉత్తీర్ణులు కావాలని చదువుకొని మంచి డాక్టర్లు, లాయర్లు ఉన్నత స్థాయికి ఎదగమని సూచించారు. అలాగే చెడు అలవాట్లకు బానిసలు కావద్దు మరియు ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలలకు అన్ని రకాలుగా సహకరిస్తుంది అని చెప్పారు. ప్రైవేటు పాఠశాలలు మరియు కళాశాలలో కంటే మెరుగైన విద్య ప్రభుత్వ పాఠశాలలోనే దొరుకుతుందని అన్నారు. అలాగే రానున్న రోజులో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో విద్యార్థులకు స్కూల్ కిట్‌లు కూడా పంపిణీ చేస్తుందని చెప్పడం జరిగింది. ఎన్ఎస్‌యుఐ గోపాల్ పేట్ మండల అధ్యక్షులు జానకిరామ్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించి విద్యార్థులకు మంచిగా చదువుకొని అలాగే క్రీడల పరంగా కూడా రాణించాలని అన్నారు. క్రీడలపరంగా కూడా జాతీయ స్థాయి వరకు కూడా ఎదగాలని అలాగే ఏదుల గ్రామానికి జాతీయస్థాయిలో పేరు తేవాలని అన్నారు. విద్యాపరంగా కూడా ప్రభుత్వం ఎండి ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ పబ్లిక్ స్కూల్స్ రెసిడెన్షియల్ స్కూల్స్ అన్నిట్లో కూడా మెరుగైన విద్యను అందిస్తుంది అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌పేట్ ఎస్ఐ శశిధర్, ఏదుల మండలం ఎంపీడీవో రఘు రాములు, కానిస్టేబుల్ సహదేవ్ , జడ్‌పిహెచ్ఎస్ ఏదుల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, ఏదుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పందెం సుఖేందర్ రెడ్డి, గోపాల్‌పేట్ ఎంఎస్‌యుఐ మండల అధ్యక్షులు జానకిరామ్ యాదవ్, గ్రామ అధ్యక్షుడు రమేష్ యాదవ్ , వార్డు మెంబర్ రాముడు యాదవ్, రాజపురం రాము, పెద్ద వెంకటయ్య, బీచుపల్లి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల దోపిడీ...

తనిఖీలు చేసి కేసులు పెట్టాలి

డీఈవో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వనపర్తి, జూన్17, ప్రభాతవార్త : జిల్లాలో ప్రవేట్‌పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల పేరుతో విద్యార్థులను దోచుకుంటున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్చార్జ్ రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తనిఖీలు చేసి పాఠశాలల దోపిడిని అరికట్టాలని డీఈఓ ఆఫీస్ సూపరింటెండెంట్ కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాలలుదోచుకుంటున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆరోపించారు. ఎల్కేజీకి రూ.20వేల నుంచి రూ.40వేలు, 6తరగతి నుంచి 10 వరకు రూ. 60 వేల నుంచి రూ. లక్ష వసూలు చేస్తున్నారన్నారు. వేర్వేరు కంపెనీల పేరు చెప్పి పాఠ్యపుస్తకాలను పాఠశాలల్లో అధిక ధరలకు విద్యార్థులకు అంటగడుతున్నారని, పాఠశాల యూనిఫారాల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. పలు పాఠశాలలకు అనుమతులు లేవని, ప్రభుత్వం నిర్దేశించిన సౌకర్యాలు క్రీడామైదానాలు గదులు లేకున్నా ఫీజులు మాత్రం తగ్గించటం లేదన్నారు. పాఠశాలలను డీఈవో తనిఖీచేసి దోపిడీచేస్తున్న పాఠశాలలపై కేసులు పెట్టాలన్నారు. ఇష్టారాజ్యంగా ఫీజులను వసూలు చేయకుండా ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఫీజుల పట్టికను పెట్టాలని జిల్లా కలెక్టర్ ఫీజులను నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దోపిడీ ఇలాగే కొనసాగితే విద్యార్థులను సమీకరించి పాఠశాలల వద్ద ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశీ, ఉదయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్ నూతన ఎస్సై నాగన్నను కలిసిన భూత్పూర్ జర్నలిస్టులు

భూత్పూర్ నూతన ఎస్సై నాగన్నను కలిసిన భూత్పూర్ జర్నలిస్టులు

భూత్పూర్, జూన్ 17, ప్రభాతవార్త : భూత్పూర్ పోలీస్ స్టేషన్ కు నూతనంగా వచ్చిన ఎస్సై నాగన్నను భూత్పూర్ జర్నలిస్టులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సై నాగన్నను కలిసిన వారిలో గొడుగు వెంకటయ్య(వార్త), నరేష్(ఈనాడు), అర్వ విజయ్‌కుమార్(ఆంధ్రప్రభ), బి వెంకటేశ్వర్లు(సాక్షి), జహంగీర్(విజయక్రాంతి), లింగగాళ్ల నర్సింహులు(ఎస్9 న్యూస్) ఉన్నారు. బుధవారం ఎస్సైని స్వయంగా కలిసి సన్మానించినవారిలో భూత్పూర్ మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు అబుబాకర్ సిద్ధిఖీ, రాంరెడ్డిలు, మండల కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడ జైదు శ్రీనివాసులు తదితరులున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే

వనపర్తి ప్రతినిధి, జూన్ 17, ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామ పం చాయతీ భవనాలు అంగన్వాడి కేంద్రాలు, జువీ విలేజ్ ఆర్గనై జేషన్, వ్యవసాయ గిడ్డంగులు, మహిళా శక్తి భవనము, ,వర్క్ షెడ్డు భవనాల నిర్మాణాల కోసం రూ. 9.12.00,000 నిధు లు మంజూరు అయిందని తెలిపారు. ఈ నిధులతో వనపర్తి నియోజకవర్గ పరిధిలోని గ్రామాల సర్వతోముఖాభివృద్ధి చెం దుతాయని అన్నారు. రైతన్నలకు అండగా, మహిళా సాధికార తకు ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ

విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేసిన దృశ్యం

మదనాపురం, జూన్ 17 ప్రభాతవార్త : ప్రభుత్వం పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించాలని రామన్ పాడ్ సర్పంచ్ ఆఫ్రీన్ బేగం అంజద్‌అలీ కోరారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్, యూనిఫాం, మధ్యాహ్న భోజన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమంలో మన గ్రామ బడిలో మన పిల్లలను చేర్పించాలని ఇటువంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువుల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం సన్న బియ్యంతో మధ్యలో భోజనం వారానికి మూడు సార్లు గుడ్లు తీస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జలంధర్ రెడ్డి, ఉప సర్పంచ్ రాధా, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు..

ఆత్మకూర్ జూన్ 17, ప్రభాతవార్త: మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని గ్రోమోర్ సెంటర్లో రైతులకు జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి రమేష్ నాయక్ ప్రభాతవార్తకు తెలిపారు. ప్రస్తుత వర్షాకాల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు జీవన విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించే విత్తనాల ద్వారా రైతులు అధిక ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందని తద్వారా పట్టణంలోని గ్రోమోర్ రెండు కార్యాలయల వద్ద అందుబాటులో ఉన్న జీలుగు విత్తనాలను ఉపయోగించుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు

డిగ్రీ కళాశాల దరఖాస్తుల గడువు పొడిగింపు

ఆత్మకూర్ జూన్ 17, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో చేరేందుకు నిర్దేశించిన ఈనెల 15 గడువును 21వ తేదీ వరకు పెంచినట్లుగా ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ విలేకరులకు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ, బీకాం, తదితర కోర్సులతో పాటుగా మిగతా కోర్సులు సైతం ఆంగ్ల , తెలుగు విద్యా కోర్సులు ఉన్న నేపథ్యంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థిని విద్యార్థులు ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందేందుకు దోస్తు ప్రక్రియ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించినట్లుగా తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఇంకా అనేక రకమైనటువంటి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్ ఆర్డిఓ సుబ్రహ్మణ్యం విద్యుత్తు ఎస్ఇ తిరుపతిరావు డిఈ శ్రీనివాసరావు ఏఈ భగవంతు నాయక్ ఎంపీడీవో శ్రీనివాసరావు తహసిల్దార్ ఖాజా మైనేద్దీన్ తోపాటు నాగర్ కర్నూల్ పర్యాటక శాఖ అధికారి కల్వరాళ్ల నరసింహ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిటెంట్ చైతన్య గౌడ్ వనపర్తి జిల్లా డిఎంహెచ్ఓ సాయినాథ్ రెడ్డి డిఆర్‌డిఎ అధికారి ఉమాదేవి ఏపిఎం మద్దిలేటి వనపర్తి డిపో మేనేజర్ గోపాల్దిన్నె సర్పంచ్ దొడ్ల కవిత వీపనగండ్ల సర్పంచ్ మీసాల పార్వతమ్మ రంగవరం సర్పంచ్ మీనిగా శివయ్య నాయుడు కల్వరాళ్ల సర్పంచ్ రాముడు తూముకుంట రామన్ గౌడు వీపనగండ్ల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావులనారాయణరెడ్డి సమ్మిరెడ్డిరవీందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు గోదాల బీరయ్య యాదవ్ గోపాల్దిన్నె మాజీ సర్పంచ్ బి బాల్ రెడ్డి వెంకట రాజయ్య తూముకుంట ఉపసర్పంచ్ రాంబాబు నాయుడు రంగవరం రిటైర్డ్ విద్యుత్ అధికారి బిచ్చన్న తోపాటు విద్యుత్తు కాంట్రాక్టర్ ముంత శివయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత రైతులందరికీ న్యాయం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను మానవతా దృక్పథంతో పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిహారం అందజేస్తామని తెలిపారు. నిర్వాసిత రైతులుఎటువంటి ఆందోళన చెందవద్దని, పునరావాస కార్యక్రమాల అమలులో జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ, భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, ఆర్‌డిఓ నవీన్, సంబంధిత అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ సిహెచ్ ప్రియాంక మాట్లాడుతూ మూడు కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణకు అన్ని శాఖలఅధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలందరికీ పల్స్ పోలియో వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకోవాలని, ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా చూడాలని ఆదేశించారు. పోలియో బూత్‌ల వద్ద ఓఆర్ఎస్ కార్నర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డా. సిద్ధప్ప, డా. సత్యప్రకాశ్, ప్రోగ్రాం అధికారి భిక్షపతి, డా. సంపత్ కుమార్ సింగ్, డీఈఓ గోవిందరాజులు, జడ్పీ సీఈఓ బి. శ్రీనివాసరావు, డీఐఈఓ సుదర్శన్ రావు, డీఎల్‌పీఓ ఉదయ్ శంకర్, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధి సుదర్శన్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ పొందిన వారికి ఉపాధి

పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్న గుండా మనోహర్

(మొదటి పేజీ తరువాయి)

తీసుకొని అద్భుతంగా వారివారి కోర్సులలో రాణిస్తున్నారని తెలిపారు. మహబూబ్ నగర్ ఫస్ట్‌శిక్షణ సెంటర్ ద్వారా వారికి ఉపాధి అవకాశాలు పెంపొం దించేలా చేయడమే ప్రధాన లక్ష్యంగా మహబూబ్ నగర్ ఫస్ట్ పర్య వేక్షకులు గుండా మనోహర్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణను మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ సమగ్రంగా పర్య వేక్షించారు. అలాగే సెట్విన్ సంస్థ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్,మహబూబ్‌నగర్ ఫస్ట్ ఇంచార్జ్ నిజలింగప్ప ఇతర నిర్వాహకులు పాల్గొని పరీక్షల సజావుగా సాగేందుకు తమ వంతు కృషి చేశారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ ఫస్ట్ ఇంచార్జీ నిజలింగప్ప మాట్లాడుతూ, నిరుద్యోగ మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం ద్వారా వారిని ఆత్మనిర్భరులుగా మార్చడం,వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం లక్ష్యంగాఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.భవిష్యత్తులో మరిన్ని శిక్షణ కార్యక్రమాలను విస్తరించి,ఎక్కువమంది మహిళలకుఉపాధి అవకాశాలుకల్పించేందుకుకృషిచేస్తామని పేర్కొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. మహిళా సంఘాల సభ్యులతో పాటు,సాధారణ మహిళలందరికీ ఇక్కడ ఉచితంగా నాణ్యమైన వైద్య చికిత్స అందనున్నది. ఈ సెంటర్‌లో దాదాపు 140 రకాల ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు డాక్టర్లు, నర్సులు ఎల్లప్పుడూ ఇక్కడ అందుబాటులో ఉండనున్నట్లు మేయర్ తెలిపారు.

దేవరకద్రలో గాలి బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

మార్గమధ్యలో ఇద్దరు మృతి చెందారు. మృతి చెందిన ఇద్దరు వ్యక్తులు భారత్ మాల రోడ్డుకు సంబంధించిన సిబ్బంది గా గుర్తించారు. ఇందులో చిత్తూరు వాసి జగన్నాథ్ రెడ్డి(40) అకౌంటెంట్ గా పని చేస్తుండగా, సంతోష్ (42) డ్రైవర్ వెస్ట్ బెంగాల్‌కు చెందినవారు.

పేదల సొంతింటి కల నెరవేరస్తున్న కాంగ్రెస్ సర్కార్

◆ ఏదుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పందెం సుఖేందర్ రెడ్డి



గోపాల్ పేట్ జూన్ 17 ప్రభాతవార్త : ప్రజా ప్రభుత్వంలో ఏదుల మండల కేంద్రంలో నేడు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో ఇంటి లబ్ధిదారుడు సంగనమోని వెంకటమ్మ భర్త రాములు వారి ఆహ్వానం మేరకు మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ గృహప్రవేశ కార్యక్రమంలో ఏదుల మండల కాంగ్రెస్ నాయకులు పందెం సుఖేందర్ రెడ్డి , గోపాల్‌పేట్ మండల ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు జానకిరామ్ యాదవ్, ఏదుల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్ యాదవ్, వార్డ్ మెంబర్ రాము యాదవ్, మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులు, రామ్ రెడ్డి, లక్ష్మారెడ్డి,పెద్ద వెంకటయ్య, జి.ఉషన్, మద్దిలేటి,మునేష్, బీచుపల్లి, వెంకటస్వామి, కురుమయ్య, శివుడు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా చిట్టెం రాఘవేందర్ రెడ్డి ఎన్నిక

ధన్వాడ, జూన్ 17 ప్రభాతవార్త : ధన్వాడకు చెందిన చిట్టెం రాఘవేందర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి అధ్యక్షతన నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు.ఈ కమిటీలో భాగంగా చిట్టెం రాఘవేందర్ రెడ్డిని ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా ధన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఆయన ఎన్నికతో ధన్వాడ ప్రాంతానికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు.

బ్యాంక్ అధికారికి ఘన సన్మానం

దేవరకద్ర, జూన్ 17 ప్రభాతవార్త: బదిలీపై వెళ్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ క్యాషియర్‌ను బ్యాంక్ మేనేజర్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌకుంట్ల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అకౌంటెంట్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు బదిలీపై వెళ్తున్న సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ క్రాంతి కుమార్‌చ సిబ్బంది కలిసి అకౌంటెంట్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని, కొన్ని సంవత్సరాలుగా బ్యాంకులో అందరితో మమేకమై, విశేష సేవలు అందించాలని బ్యాంక్ మేనేజర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అటెండర్లు శ్రీనివాసులు, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనప సముద్రం భూసేకరణ భూములను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఖిల్లా ఘనపురం జూన్ 17, ప్రభాతవార్త: ఘనప సముద్రం రిజర్వాయర్ భూ సేకరణకు సంబంధించిన భూములను రైతులతో కలిసి బుధవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఈ రిజర్వాయర్ కు సంబంధించి ముంపు రైతులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని రైతులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కలెక్టర్ తో పాటు ఆర్ అండ్ ఆర్ కమిషనర్ కే శివకుమార్ నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. వీరు ఘనప సముద్రం రిజర్వాయర్ను సందర్శించి పరిశీలించారు. నీటి పారుదల శాఖ అధికారులు రూపొందించిన మ్యాప్ ను 164 ఎకరాల భూసేకరణకు సంబంధించి అక్కడికి వచ్చిన రైతులతో

ఘనప సముద్రం రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

మాట్లాడారు భూసేకరణకు సంబంధించి నష్టపరిహారం విషయంలో ప్రభుత్వం తరఫున రైతులకు తప్పనిసరిగా న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ ఘనపసముద్రం రిజర్వాయర్ భూసేకరణకు సంబంధించి రైతులు తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలిపి సహకరించాలని సూచించారు. 164 ఎకరాలకు సంబంధించి రైతులు గురువారం కలెక్టరేట్లో నిర్వహించనున్న జిల్లా స్థాయి చర్చల కమిటీకి హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదించి పరిహారం విషయంలో న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య ఆర్డీవో సుబ్రహ్మణ్యం నీటిపారుదల శాఖ అధికారులు ఇతర రెవెన్యూ అధికారులతో పాటు రైతులు గ్రామస్తులు ఉన్నారు .

పరిశోధనల ఫలితాలు సమాజానికి అందాలి

◆ పీహెచ్‌డి పూర్తి చేసిన బేగరి ఉదయ్ కుమార్‌ను అభినందించిన పియు విసి శ్రీనివాస్

మహబూబ్‌నగర్, జూన్ 17, ప్రభాతవార్త: విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న పరిశోధనలు సమాజ అవసరాలకు అనుగుణంగా ఉండి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడాలని పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్ అన్నారు. బుధవారం పాలమూరు విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో యూనివర్సిటీ పీజీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి బేగరి ఉదయ్ కుమార్ తన పీహెచ్.డి. పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా ఉపకులపతి ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్ కు పరిశోధన సారాంశ గ్రంథాన్ని సమర్పించారు. బేగరి ఉదయ్ కుమార్, యూనివర్సిటీ పీజీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కె. ప్రవీణ పర్యవేక్షణలో సింథెసిస్ , క్యారెక్టరిజషన్ , డైలక్ట్రిక్ అండ్ మాగ్నెటిక్ ప్రాపర్టీస్ అఫ్ రేర్ ఎర్త్ డోపేడ్ జింక్ ఫర్రీట్స్ " అనే అంశంపై పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధనలో యూరోపియం, ఎర్బియం వంటి అరుదైన భూమూలకాలను జింక్ ఫెరైట్ల లో డోప్ చేయడంద్వారావాటి నిర్మాణ,అయస్కాంత, విద్యుత్, ఆప్టికల్, సూక్ష్మజీవ నిరోధక లక్షణాల్లో కలిగే మార్పులను విశ్లేషించారు. సహఅవక్షేపణ పద్ధతిలో తయారు చేసిన నానో ఫెరైట్ నమూనాలపై ఎక్స్ రే డిఫ్రాక్షన్ (ఎక్స్ఆర్‌డి), ఫీల్డ్ ఎమిషన్ స్కానింగ్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోపీ (ఎఫ్ఇఎస్ఇఎం), ఎనర్జీ డిస్పర్సివ్

ఉదయ్‌కుమార్‌ను అభినందిస్తున్న పియు విసి

ఎక్స్ రే విశ్లేషణ (ఇడిఎక్స్), ఫోరియర్ ట్రాన్స్‌ఫార్మ్ ఇన్‌ఫ్రారెడ్ స్పెక్ట్రోస్కోపీ (ఎఫ్‌టిఐఆర్), యూవీవిజిబుల్ స్పెక్ట్రోస్కోపీ, డైఎలక్ట్రిక్ మరియు అయస్కాంతలక్షణాలపై విస్తృత అధ్యయనాలు చేపట్టారు. ఈ పరిశోధన ద్వారా అరుదైన భూ మూలకాల డోపింగ్ వల్ల జింక్ ఫెరైట్లభౌతిక,రసాయన లక్షణాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని నిరూపితమైందన్నారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థి బేగరి ఉదయ్ కుమార్‌ను, పరిశోధన పర్యవేక్షకులు డా. కె. ప్రవీణను ఉపకులపతి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓఆర్ఎస్, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలి

◆ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

◆ డిఎంఅండ్‌హెచ్ఓ శ్రీనివాసులు

మహబూబ్‌నగర్, జూన్ 17, ప్రభాతవార్త: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చిన్నపిల్లలు డయేరియా బారిన పడకుండా కాపాడుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా వైద్యశాఖ అధికారి డా. శ్రీనివాసులు ఆదేశించారు. మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కుమ్మరివాడిలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఏ.శ్రీనివాసులు సందర్శించి వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. "స్టాప్ డయేరియా"కార్యక్రమం ప్రారంభించి అందరికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలని అన్నారు. 5సం. ల లోపు పిల్లలు డయేరియా గురికాకుండా అన్ని నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డిఎంఅండ్‌హెచ్ఓ

పరిసరాలపరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. యూపీహెచ్ సీ పరిధిలోని ప్రజలందరి ప్రాథమిక ఆరోగ్య బాధ్యత సిబ్బంది పై ఉందని అన్నారు. కార్యక్రమములో డా.ఎన్. శైలజ, డా. శివకాంత్, డా.పులి విద్య, యూపీహెచ్‌సీ డా. తస్లీమా ఫర్హాత్, డీపీవో సీతారామ్ గౌడ్,డా. ప్రవీణ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కురుమ సంఘం ఏర్పాటు చేయాలి

వినతి పత్రం సమర్పిస్తున్న కురుమ సంఘం నాయకులు

దేవరకద్ర, జూన్ 17 ప్రభాతవార్త: కౌకుంట్ల లో కురుమ సంఘం ఏర్పాటు చేయాలని వెటర్నరీ డా. సుశీల్ గౌతమ్ కు కౌకుంట్ల కురుమ సంఘం సభ్యులు వినతి పత్రం అందజేశారు. కురుమ సంఘానికి ప్రత్యేక కోట, ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కురుమ సంఘం సభ్యులు కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుమల సామాజిక ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి,సంక్షేమ పథకాల అమలులో తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కురుమల జీవనోపాధికి ప్రధాన ఆధారమైన గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని అన్నారు. అలాగే విద్య ఉపాధి రాజకీయ రంగాల్లోకురుమలకు తగిన ప్రాతినిధ్యం కల్పించి, వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల కురుమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం

ధన్వాడ, జూన్ 17 ప్రభాతవార్త: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధానిగా 12 సంవత్సరాల సేవా ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ధన్వాడ మండలంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటే కార్యక్రమాన్నిఘనంగా నిర్వహించారు. అమ్మ ఒడి" కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం స్థానికంగా ఉత్సాహంగా సాగింది. బీజేపీ ధన్వాడ మండల అధ్యక్షుడు శివరాజ్ సమక్షంలో, కార్యక్రమ ఇంచార్జ్ కన్వీనర్ చక్రి ఆధ్వర్యంలో మొక్కల నాటకం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ప్రపంచ వేదికపైప్రత్యేక గుర్తింపు పొందుతోందని పేర్కొన్నారు.పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జ్యోతి రామచంద్రయ్య, ఓబీసీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు మాకం సురేందర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెట్రం గోవర్ధన్ గౌడ్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు సుంకు ఉమేష్ కుమార్, లంకల శ్రీనివాస్ గౌడ్, వై.పి. కథలప్ప, కురుమూర్తి సుదర్శన్ గౌడ్, జగదీష్, రాఘవేందర్, మాదారం రవికుమార్, మంగలి వెంకటేష్, కృష్ణ, శ్రీకాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

మదనాపురం, జూన్ 17 ప్రభాతవార్త : ఈనెల 20,21,22, తేదీల లో మహబూబ్‌నగర్ వేదికగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆసంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్,కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు తెలిపారు.బుధవారం మండలకేంద్రంలో మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మహాసభలకు త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్,తమ్మినేని వీరభద్రం,బి.వెంకట్,జాన్ వెస్లీ హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సభలో వెయ్యి మంది ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. మండలం నుండి సైతం అన్ని సంఘాల నాయకులు కార్మికులు రైతులు పెద్దయెత్తున హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండ్ల సత్యనారాయణ, చిర్ల ప్రసాద్, చిరంజీవి, నాగేష్, మణివర్ధన్, సుధాకర్, అంజి, చెన్నయ్య, రామాంజ నేయులు పాల్గొన్నారు.

పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

నవాబుపేట, జూన్ 17 ప్రభాతవార్త : మండల పరిధిలోని అమ్మాపూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం 2026,27 విద్యా సంవత్సరం బడిబాట కార్యక్రమంలో భాగంగా నూతనంగా చేరిన మొదటి తరగతి విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, చిన్నారుల చేత పలకలపై అక్షరాభ్యాసం చేయించారు.ఈ కార్యక్రమానికి లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిహెచ్ఎం చిన్న కిష్టయ్య ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను అక్షరోద్యుక్తులను చేశారు. జిహెచ్ఎం చిన్న కిష్టయ్య మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతి బిడ్డపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని పాఠశాల అభివృద్ధి అనేది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులందరి బాధ్యతఅని అన్నారు. పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడిని తప్పకుండా కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు మంజుల రఘు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు యాదయ్య, శ్యామ్, మల్కయ్య, అంజనేయులు, స్వామి,పవన్‌కుమార్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు సునీత, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు. శేఖర్, ఉపాధ్యాయులు. కృష్ణయ్య, శ్రీ విద్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌పై బిఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ

మద్దూరు, జూన్ 17 ప్రభాతవార్త : మద్దూరు మండల కేంద్రంలో బుధవారం రోజు ఎస్ఐఆర్ పై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిఎల్ఓలకు తహశీల్దార్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 25 నుంచి చేపట్టబోయే ఎస్ఐఆర్ కు ప్రతి ఒక్కరు సహకరించాలని అలాగే ఎస్ఐఆర్ విషయంలోబిఎల్ఓ లు ఎలాంటి తప్పులు లేకుండాచూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిర్దవరి అమరేందర్ శెట్టి,ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

వీపనగండ్ల జూన్ 17 ప్రభాతవార్త : వివిధ అభివృద్ధి పనులలో బుధవారం నాడు మండలంలో పాల్గొనడానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు గోపలదిన్నె సర్పంచ్ దొడ్ల కవిత రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొడ్ల బాల్రె రెడ్డి గ్రామంలో ఉన్న వివిధ సమస్యలపై ఆయనకు మెమోరండం అందజేశారు. ఆ గ్రామానికి వీపనగండ్ల క్రాస్ రోడ్ నుండి రెండు కిలోమీటర్లు గోపాల్ దిన్నె గ్రామానికి రోడ్డు సరిగ్గా లేదని అదేవిధంగా 357 సర్వేనెంబర్ లో 241 ఎకరాల భూమి పేదలకు ఇవ్వడం జరిగిందని దానికి గత అనేక సంవత్సరాల కిందట సాగు చేసుకోవడానికి పేదలకు పట్టాలు గోపాల్దిన్నె రంగవరం పుల్లగ్చర్ల గ్రామాల వారికి ఇవ్వడం జరిగిందని అది అనేక సంవత్సరాల నుండి పెండింగు ఉందని దాన్ని పరిష్కరించి భూమిపై ఉన్న పేదలకు,లావని పట్టా సర్టిఫికెట్లు ఇచ్చినటువంటి వారికి చట్టపరంగా న్యాయం చేయాలని వారు కోరారు. అదే విధంగా మోకాపై ఉన్న రైతులకు న్యాయం చేయాలని గ్రామంలో సిసి రోడ్లు నిర్మాణానికి తోడ్పాటున అందించాలని అదేవిధంగా వివిధ గ్రామాలకు వెళ్ళేటువంటి రోడ్లు సరిగా లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తదితర సమస్యలపై వారుమంత్రికిమెమోరండం అందజేశారుకనీసం గ్రామాలలో ఉన్న సౌకర్యాలను అభివృద్ధి చేయడానికికృషి చేయాలనివారు కోరారు.

మంత్రి సమావేశంలో..

నిద్రావస్థలో తూలుతున్న విద్యుత్ అధికారి

సమావేశంలో నిద్రావస్థలకు చేరుకున్న విద్యుత్ అధికారి

వీపనగండ్ల జూన్ 17, ప్రభాతవార్త : వీపనగండ్ల మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. బుధవారం మండలంలోని గోపాల్దిన్నె గ్రామ సమీపంలో ఉన్న 33/11 కెవి సబ్ స్టేషన్‌ను ప్రారంభించిన సందర్భంగా విద్యుత్తు వాడకంపై రైతులతో విద్యుత్తు అధికారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాలకు విద్యుత్తును అందించే అంశంపై మాట్లాడుతుండగా ఆ విషయాలను ఏమీ పట్టించుకోకుండా పై స్థాయిలో ఉన్న విద్యుత్తు అధికారి ఆ విషయాలు ఏమి పట్టించుకోకుండా నిద్రావస్థలో కూరుకు పోయాడు. దీనిని గమనించిన అక్కడి రైతులు తెలంగాణ రాష్ట్రఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఉంటే ఆయన ముందరనే అధికారులు ఈ విధంగా నిద్రవస్థలోకి జారుకోవడం ఎంతవరకు కరెక్ట్ అని గుసగుసలు మాట్లాడుకున్నారు. మంత్రి మాట్లాడుతున్న సందర్భంలో ఈ రకంగా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు రైతులకు ఉండే సమస్యలపై తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఆ సమావేశానికి వచ్చిన రైతులు తెలియజేశారు ఏది ఏమైనా అధికారులు ప్రజా ప్రతినిధులు గాని విషయాలుచెబుతున్నప్పుడు వారి విషయాలను తెలుసుకోవాల్సిన అవసరం అధికారుల బాధ్యత అని రైతులు అన్నారు.

టీజీ20 ఆరంభ వేడుకలకు రండి

◆ సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేసిన హెచ్‌సీఏ కార్యదర్శి మన్నే జీవన్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న మన్నే జీవన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 17, ప్రభాతవార్త : తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కార్యదర్శి మన్నె జీవన్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 21న నుంచి చారిత్రక టీజీ20 లీగ్ ఆరంభం కానున్న నేపథ్యంలో ఆరంభ వేడుకలకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డిని జీవన్ రెడ్డి ఆహ్వానించారు. టీజీ20 టోర్నమెంట్, ఫ్రాంచైజీలు, పోటీపడుతున్న క్రీడాకారులు, జిల్లా క్రికెటర్ల ప్రాతినిధ్యం వంటి అంశాలను సీఎం రేవంత్‌రెడ్డికి వివరించిన జీవన్‌రెడ్డి లీగ్ ఆరంభ వేడుకల ఆహ్వాన పత్రికను ఆయనకు అందించారు. కార్యక్రమంలో క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ సోనీబాలా దేవి, హెచ్‌సీఏ కోశాధికారి అనిల్ కుమార్,అపెక్స్ కౌన్సిల్‌కౌన్సిలర్ సునీల్‌అగర్వాల్ పాల్గొన్నారు.

దివీస్ ల్యాబొరేటరీస్‌లో ఉద్యోగాలు

నియామక పత్రాలు అందజేసిన ఉపకులపతి శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్ బాబు

మహబూబ్‌నగర్, జూన్17, ప్రభాతవార్త: పాలమూరు విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ప్రముఖ ఔషధ తయారీ సంస్థ దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్, హైదరాబాద్ లో పాలమూరు విశ్వవిద్యాలయానికి చెందిన 12 మంది విద్యార్థులు ఉద్యోగాలకుఎంపికయ్యారు.ఎంపికైన వారిలో మావిల్ల రవి, టి.నరేందర్ బాబు, కె.నాగరాజు, ఈ.విష్ణు వర్ధన్, అందలం మధు, ఈ. నరేష్ గౌడ్, కొత్తగొల్ల పావనిక, ఆంజనేయులు, ఎస్. వాసుకి, మిట్టపల్లి హేమశ్రీ, ఎ. రాఘవి, పెరుమల్ల శ్రావణి.. ఉన్నారు. వీరు ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ (క్యూసి), మైక్రోబయాలజీ, ఇసిడి విభాగాల్లో ఉద్యోగ అవకాశాలను పొందారు.ఎంపికైన అభ్యర్థులకు సంస్థ ఇప్పటికే ఆఫర్ లెటర్లు జారీ చేసినట్లు ప్లేస్‌మెంట్ అధికారి డా. ఎస్.ఎన్. అర్జున్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్, రిజిస్ట్రార్ ఆచార్య పూస రమేష్ బాబు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఓఎస్డి టు వైస్ ఛాన్స్‌లర్ పాలమూరు విశ్వవిద్యాలయం యూనివర్సిటీ పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.డి. మధుసూదన్ రెడ్డి, కెమిస్ట్రీ విభాగాధిపతి డా.ఎండి నూర్జహాన్, పరీక్షల నియంత్రణ అధికారి డా. కె. ప్రవీణ , ప్లేస్‌మెంట్ సెల్ అధికారి డా.ఎస్.ఎన్. అర్జున్‌కుమార్, కోఆర్డినేటర్లు డా.ఎస్. రవి కుమార్, ఏ.సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొని ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఎమ్మెల్యే పర్యటన విజయవంతం చేద్దాం

ఊర్కొండ, జూన్ 17 ప్రభాతవార్త : ఊర్కొండపేట పబ్బతి ఆంజనేయస్వామి వారి ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవానికి జననేత, నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, జనం మెచ్చిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి గురువారం ఉదయం 11గంటలకు రానున్న నేపథ్యంలో ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేద్దామని మాదారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఊర్కొండ గేటు వద్ద ఘన స్వాగతం పలికి అక్కడి నుండి ఆలయం వరకు బైక్ ర్యాలీగా స్వామి వారి సన్నిధికి చేరుకుంటుంది. ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.